కథానిక

# పార్వతమ్మ

దద్దనాల రంగనాయకమ్మ

"అమ్మా, కుసుమా...కుసుమా!"

"... ... ... ..."

"పార్వతీ" అన్న పిలుపు విని "ఆఁ వస్తున్నానండీ"అంటూ సావిట్లోకొచ్చింది పార్వతమ్మ.

"అమ్మాయేదే? ఎంతపిల్చినా పల్కదేమి? దానిపేర కవరొచ్చింది."

"మేడపైనుంది. విన్పించలేదేమో! నేనూ పైకెడుతున్నాను. ఆకవరిట్లా ఇవ్వండి, నేనిస్తాను"

జగన్నాథం కవరందించాడు. పార్వతమ్మ దాన్నందుకొని పైకెళ్ళింది.

విలాసం తనపేరే వుంది. కవరు చించింది కుసుమ. లోపలి కాగితం పచ్చగా కన్పించింది. ఒకటి శుభలేక. ఇంకోటి తనను మరీమరీ రమ్మని వ్రాసిన స్నేహితురాలి స్వాగత లేఖ. రెండూ సాంతంగా చదివింది కుసుమ. శుభలేఖలో వధూవరుల ఫోటోలుకూడా వున్నాయి. తన స్నేహితురాలు మురళి పెళ్ళా? చదువెందుకు మానేసిందీ? వరునిపేరు మురారీరావు. బాగానే వుంది. తను తప్పకుండా వెళ్ళాలి. ఈ శుభవార్త తల్లితో చెపుదామని తలెత్తింది. పార్వతమ్మక్కడుంటేగా? ఎప్పుడెళ్ళిపోయిందో క్రిందకి. కుసుమ గబగబా క్రిందకెళ్ళింది.

"నాన్నారూ! మురళి పెళ్ళిటండీ! వరుడు యం.ఎస్.సీ. మనందర్నీ మరీమరీ రమ్మని వ్రాసింది" అంటూ కవరందించింది తండ్రికి.

"ఏమిటీ? మురళి పెళ్ళా? ఏం కంగారో! నీకంటె చిన్నదానిలా కన్పడుతుంది. ఇప్పుడే చదువు మాన్పించి పెళ్ళిచేయవలసిన అగత్యమేమొచ్చిందీ" అంటూ తన వుద్దేశ్యాన్ని తెల్పింది పార్వతమ్మ.

"ఆ గొడవకేంగాని, మనందర్నీ రమ్మని వ్రాసిందిగా మరి వెడదామా?"అని అడిగింది కుసుమ.

"అట్లాగేలే, ఏమంతభాగ్యం. బెజవాడెంతసేపెళ్ళిరావాలీ!" అంటూ కూతుర్ని సంతోషపెట్టాడు జగన్నాథం.

అప్పుడే మురళి పెళ్ళయి పదిరోజులయింది. చుట్టాలంతా ఎటువాళ్ళటు సర్దుకున్నారు.

ఆరోజున జగన్నాథంగారూ, కుసుమా ఒక్కసారే భోజనాలకి కూచున్నారు. పార్వతమ్మ వడ్డిస్తోంది.

"పెళ్ళి బాగానే జరిగిందికదమ్మా?" అడిగింది.

"మంచి సంబంధం కుదరాలే గాని, పెళ్ళి చెయ్యటం ఏమీ అంత బ్రహ్మాండంగాదు"అన్నారు జగన్నాథంగారు, ఎన్నో పెళ్ళిళ్ళు చేసినట్టుగా.

పార్వతమ్మేమీ మాట్లాడలేదు.

కుసుమ భోంచేసి లేచింది.

"అదేమిటండీ! మీభోజనం తరగటంలేదు. మగవాళ్లు కాళ్ళ తడారేటప్పటికి భోంచేసి లేవాలంటారు." అంటూ ఆలోచనా సముద్రంలో మునిగిన భర్తను హెచ్చరించింది పార్వతమ్మ.

"ఆఁ ఏదో ఆలోచిస్తోంటే ఆలస్యమయిందిలే. దానికేంగాని...మనమ్మాయికి మాత్రం పెళ్ళిచేసే వయస్సురాలేదా? మనం ఎందుకు తొందరపడటం లేదూ?"అంటూ తర్కించాడు జగన్నాథం.

"అప్పుడే ఏంపెళ్లండీ? ఇంకా యిరవై ఏళ్ళన్నా నిండలేదు. అయినా చదువు పూర్తిగావద్దూ? నేనే మిమ్మల్ని పీడించవలసిందిబోయి, మీరే నన్ను పీడిస్తున్నారే!" అంది ఆశ్చర్యంగా పార్వతమ్మ.

"పీడించటంగాదు. మనకేం తక్కువనీ పెళ్ళిమాట తలపెట్టకపోవటానికి? అదీగాక ఈ ఆస్తంతా దానిదే. ఇంక చదువు విషయం అంటావా? ఆఁ ఏదో హాబీగా చదువుతోందేగాని, తప్పనిసరిగా పరీక్షపాసై వుద్యోగంచెయ్యవల్సిన కర్మేముందీ దానికి? ఇంతకీ నీకెందుకు యిష్టంలేదంటావు?"

"బావుంది. నా యిష్టాయిష్టాల కేముందీ? యిరవైయేళ్ళన్నా నిండకుండా పెళ్ళిచెయ్యటం నాకేమీ యిష్టంలేదు. తర్వాత మీ యిష్టం." అంటూ చిన్నబుచ్చుకున్న మొహంతో జవాబిచ్చింది పార్వతమ్మ.

"అదికాదు పార్వతీ! నేను చెప్పేదికూడా కొంచెం ఆలోచించుమరీ. మనకిక ఎవరున్నారు గనుక ఎటొచ్చినా అదేగా? దాని ఆనందంకంటే మనకింకేం కావాలీ? పెళ్ళయిన తర్వాత దాని కడుపున నలుగురు పిల్లలుపుడితే వాళ్ళనిచూస్తూ కాలం గడపవచ్చు" అంటూ భోజనం ముగించి సావిట్లో కెళ్ళిపోయాడు జగన్నాథం.

పార్వతమ్మకేమీ పాలుపోలేదు. భర్తగారి ఆఖరిమాట లావిడను స్పృహతప్పేటంత పరిస్థితి వరకూ లాక్కొచ్చాయి.

"కుసుమకి పెళ్ళా? ఏడాది తిరగకుండా గర్భం. తనకి మనవలు. తను అమ్మమ్మ. తనమ్మమ్మౌతుందా? అప్పుడే తనమ్మమ్మయ్యేంత ముసలిదా? అలాంటిదెప్పటికీ జరక్కూడదు." అని గట్టిగా నిశ్చయంచేసుకొంది పార్వతమ్మ.

ప్రస్తుతం పార్వతమ్మ చాలా అందంగా వుంటుంది. మనిషికి నలభైఏళ్ళు వచ్చినా ముప్పైఏళ్ళ లోపు మనిషిలా కన్పడుతుంది. కుసుమనీ, పార్వతమ్మనీ చూచినవాళ్లు, వాళ్లు తల్లీకూతుళ్లను కోరు అక్కాచెల్లెళ్ళనుకుంటారు. ఎప్పుడయినా పేరంటానికిగాని సినిమాకిగాని వెళ్ళవలసి వస్తే, వాళ్ళిద్దరూ ఒకర్నిమించినట్లొకళ్ళు ముస్తాబు చేసుకొంటారు. అలాంటి సమయాల్లో పార్వతమ్మని పోలికేపట్టలేం. ఇటువంటి నవయౌవని పార్వతమ్మకు అమ్మమ్మగా మారటం ఏమిష్టముంటుంటుంది చెప్పండి? పోనీ కూతురుకి పిల్లలే కలగరనుకుంటే అల్లుడొస్తే అత్తగారనయినా పిలుస్తాడుగా! కూతురుకు పెళ్ళిచెయ్యమనకపోడానికీ, భర్త చేస్తానన్నా వాయిదాలువేయటానికిదే కారణం. ఇలాగే ఏవేవో ఆలోచించుకు పోతోంది పార్వతమ్మ. భర్త భోంచేసిన కంచమన్నా తీయలేదు. "పార్వతీ" అన్న భర్తమాటలు పార్వతమ్మను ఆలోచనా, సాగరంనుండి తిరిగి వంటగదిలోకి తీసుకొచ్చాయి. "ఆఁ వస్తున్నానండీ" అంటూ పార్వతమ్మ త్వరగా సావిట్లోకెళ్ళింది.

"వంటింట్లోనే పాతుకు పొయ్యావేం? యింకా వస్తావు, యింకావస్తావు, అని కాసుక్కూచున్నాను, తమలపాకులు తీసుకురా" అన్నారు విసుగ్గా జగన్నాథం. పార్వతమ్మ ఏమీ మాట్లాడలేదు. గబగబా తమలపాకులు మడిచి అందిస్తూ "ఏమండీ! మీరేమీ అనకపోతే ఒకమాట చెప్తాను. కుసుమకి ఇప్పుడిప్పుడే పెళ్ళివద్దు. అనవసరంగా దాని చదువు చెడుతుంది. అదే నాభయం. తర్వాత మీయిష్టం." ఎంతో లాలనంగా కోరింది.

"అట్లాగే పార్వతీ ఏదో మాటవరసకన్నానే గానీ, నీకిష్టంలేకుండా పెళ్ళి జరుగుతుందా? ఈ మాత్రం దానికింత బ్రతిమాలాలా? ఆఁ ఆ గొడవకేంగానీ, నా స్నేహితు డొకడొచ్చాడు. ఇవ్వాళ సినిమా కెడుతున్నాం. టైంకూడా అయ్యింది." అంటూ కోటు తగిలించుకొని గుమ్మం దాటారు జగన్నాథంగారు. భర్త కనుమరుగయ్యేదాకా చూసింది. తర్వాత వీధితలుపు వేసుకొని వంటగదిలో కెళ్ళింది. తను అమ్మమ్మ గాబోవటంలేదు. ఆ సంతోషంలో పార్వతమ్మకి ఆకలనిపించలేదు. క్రింది తలుపులన్నీ వేసేసి తిన్నగా పైకెళ్ళింది. కుసుమ ఏదో బొమ్మవేస్తూ తలెత్తిచూసి, మళ్ళీ తనపనిలో నిగ్నమయిపోయింది. పార్వతమ్మ కుసుమ ప్రక్కగా కుర్చీలో కూచుంది.

"కుసుమా"

కుసుమ తలెత్తి చూసింది ప్రశ్నార్థకంగా, "నిన్నొకటడుగుతానుగాని సిగ్గుపడకుండా చెప్పాలి. నీకిప్పుడు పెళ్ళిచేసుకోవాలని వుందా?" ఇదీ పార్వతమ్మ ప్రశ్న.

నిజమే తనకి ప్రస్తుతం పెళ్లిచేసుకోవాలనివుందా? తనని తానే ప్రశ్నించుకుందిగానీ "నిజంగాలేదమ్మా. నాకింకా చదువుకోవాలనివుంది చదివిస్తారా?" అని తిరిగి ప్రశ్నించింది కుసుమ.

"ఓ! నీయిష్టం వచ్చినంతవరకూ చదువుకో" అమమ్మ నవ్వటం పూర్తిగా తప్పిపోయింది గదా అన్న సంతోషంలో అభయమిచ్చేసింది పార్వతమ్మ, ఇద్దరికీ ఒక్కసారే చెప్పలేనంత ఆనందం గల్గింది. వారి ఆనందానికి కారణాలు వేరువేరు.

జగన్నాథంగారు ప్లీడరు. వారికి చాలా ఆస్తుంది. ప్రస్తుతం వారు నివసించే పట్టణానికి సమీప గ్రామంలోనే సుమారు 20 ఎకరాల వరిపండే భూమి, సుమారు ఐదెకరాలలో రకరకాల పళ్ళతోటలు, పట్నంలో నివసించటానికి చక్కని మేడ, గుర్రబ్బండీ, కావలసినన్ని హంగులూ వున్నాయి. కేసులు చాలావస్తాయి. గాని

దేహానికి కావలసినంత విశ్రాంతి వుంచుకొన్న తర్వాతనే కష్టపడేవారు. అయినా వారికి రాబడికి లోటులేదు. దీనికితోడు ఒక్కగానొక్క కూతురు. అందకత్తె. తర్వాత ఇద్దరు ముగ్గురు పుట్టినాగాని బ్రతకలేదు. కుమారుల్లేరన్న కోరిక, ఆ దంపతులను ఏమీ బాధించేదిగాదు.

ప్రస్తుతం కుసుమకు ఇరవై ఒకటో సంవత్సరం జరుగుతూంది బి. ఏ. ప్యాసైంది. ఇంకా పెళ్ళి చెయ్యలేదు. • అయినా పార్వతమ్మ సంఘానికి భయపడదలచలేదు.

"ఫ్లారెన్స్ నైటింగేల్ చూశారూ? ఇవ్వాళే ఆ పుస్తకం చదివాను. చక్కగా ఆ అమ్మాయి పెళ్ళిచేసుకోకుండా దేశానికి సేవచేసింది. గనుకనే తరతరాలుగా ఖ్యాతిని సంపాదించుకోగల్గింది" అంది పార్వతమ్మ భర్తతో ఒకనాడు.

"అయితే నీవుకూడా పెళ్ళిచేసుకోకుండా, అట్లా సేవచేయలేక పోయ్యావా?" అన్నారు నవ్వుతూ జగన్నాథంగారు.

ఇంతలో కుసుమ మేడపైనుంచి వచ్చింది. "నాన్నారూ, సినిమాకెడుతున్నా. అమలకూడా వస్తానంది"

"అట్లాగేనమ్మా. ఎంతకావాలంటావ్"

"మూడురూపాయలు చాలు."

"చిల్లరలేదు. ఈనోటు తీసుకెళ్ళు. వచ్చేటప్పుడు జాగ్రత్తగారండి" అంటూ మనీపర్సు తీసి ఐదురూపాయలనోటు అందించారు జగన్నాథంగారు. దాన్ని తీసుకొని వెళ్ళిపోయింది కుసుమ.

"పార్వతీ! అమ్మాయిని చూశావా? చిలకలా వుంది పెళ్ళయితే అమ్మాయి కళ్ళకెదురుగా లేకుండాపోతుందనా నీభయం? అట్లాగయితే యిల్లరికపుటల్లుణ్ణే తెస్తాను. ఎన్నాళ్ళనీ యిట్లా? పార్వతీ నువ్వుచెప్పినట్లే చదువుకి ఆటంకం అవుతుందని యింతవరకూ వూరుకున్నానా? ఆ చదువు కూడాఅయిపోయింది. అసలు నీ మనసులోవున్న సంగతి ఏమిటో చెప్పకూడదూ?" చిరుకోపంగా అడిగాడు జగన్నాథం.

పార్వతమ్మ తనకిక ఓటమి తప్పదనుకుంది. ఎన్నాళ్ళని చదువువంక పెడుతుంది? పోనీ అమ్మాయిని డాక్టర్ కోర్సుకి పంపించి పెళ్ళి చెయ్యొద్దని చెపుదామా? అమ్మో! అట్లా చెప్పటమే? అయితే పెళ్ళి కొప్పుకోవాలా? మొన్ననే మురళి వుత్తరం వ్రాసింది. ఆడపిల్లట. కుసుమకిమాత్రం కలగకుండా వుంటారా? పోనీ ఈఏడాదికైనా ఆపేస్తేబావుణ్ణు.

"ఏం పార్వతీ? పెళ్ళంటే నీ వింత బెంగపడతావెందుకూ? నీ తత్వం నాకేమీ బోధపడటంలేదు. కుసుమనడిగి, ఈ ఏడాదే ఆ కాస్తపనీ అవునని పించేస్తాను" అన్నాడు జగన్నాథంగారు కోపంగా. పార్వతమ్మ మాట్లాడలేకపోయింది.

పార్వతమ్మ కేమీ తోచటంలేదు. ఏమిచేస్తున్నా కుసుమ విగ్రహమే కన్పడుతోంది. అమ్మాయి యింట్లో కళ్ళకెదురుగా కన్పడుతోంటే భర్త పోరు మరీ ఎక్కువౌతోంది. కుసుమ కొన్నాళ్ళ పాటు యెటన్నా వెడితే కొంచెం మనస్సు శాంతిస్తుంది. మొన్నను, బెజవాడనుంచి సత్యవతి వదిన కూడా వుత్తరం వ్రాసిందిగా కుసుమని పంపమని. ఆ వూళ్ళోనే దాని స్నేహితురాలు మురళి కూడా వుంది. ఇంత మంచి ఆలోచనతట్టినందుకు తబ్బిబ్బి అయిపోయింది పార్వతమ్మ. కుసుమదగ్గరకెళ్ళింది.

"అమ్మా! కుసుమా! మొన్న సత్యవతి అత్తయ్య రాసిన ఉత్తరం చూశావుగా! మరి ఎప్పుడెళ్ళతావూ?" అంటూ ప్రశ్నించింది.

"మురళి కూడా వ్రాసిందమ్మా రమ్మని. మీ రెళ్ళమంటే సాయింత్రమే వెడతా. ఓ పదిహేను రోజు లుండి మళ్ళీ వస్తా" అంటూ సంతోషంతో పెట్టీ, బెడ్డింగూ సర్దుకోసాగింది. పార్వతమ్మ తల్చుకోవటం — చెయ్యలేకపోవటమూనా? ఆ సాయింత్రమే కుసుమని బెజవాడ పంపివేసింది...

"రవి కన్పట్టంలేదేం మురళీ?" అని స్నేహితురాలిని అడిగింది కుసుమ.

"ఓహో! ఇప్పటికి జ్ఞాపకమొచ్చాడన్నమాట. అవున్లే. మీ కెట్లా జ్ఞాపకముంటాం. అయినా నీకు రవితో ఏంపనీ?" కుసుమ నేడిపించటానికి అడిగింది ప్రశ్న మురళి.

"అలా అడుగుతావేం? పనిలేకపోతే తెలుసుకోకూడదా? అయితే నా కిక్కడ ఏం పనుందని వచ్చాను? పోనీలే వెళ్ళిపోతాను."

"అయ్యయ్యో! చాల కోపం వచ్చిందే వదిన గారికి" అంటూ ఛలోక్తి విసిరింది.

నిజంగా కుసుమకి సిగ్గువేసింది. "పోదూ! తన పేరెత్తానేగా నీ విట్లా మాట్లాడుతున్నది. సరేలే నీతో ఇకమీద మాట్లాడితే అడుగు" అంటూ ప్రక్కకి తిరిగికూచుంది కుసుమ. ఎట్లా ఓడించాలా అని యిద్దరూ ప్రయత్నించేస్తున్నారు.

"అమ్మా! మురళీ?" అన్న కేక విన్పించింది యిద్దరికిసీ. ఇద్దరూ ఆశ్చర్యపోయారు. అది జగన్నాధంగారి గొంతుక.

"అరే! మీ నాన్నగారొచ్చారే? పద వెడదాం" అంటూ వాళ్ళిద్దరూ క్రిందకొచ్చారు. క్రింద సావిట్లో మురళి అమ్మగారు అన్నపూర్ణగారు, జగన్నాధం గారితో మాట్లాడుతున్నారు.

"ఏంనాన్నా? మీరొచ్చారే? అమ్మకెలా వుంది?"అంటూ ఆత్రంగా ప్రశ్నించింది కుసుమ.

"మీ అమ్మకి బాగానే వుందమ్మా! రవేడీ? అతనితో కొంతపనుండి వచ్చాను"అన్నారు.

"రవీ, మా అల్లుడూ కలసి ఏదోపనిమీద గుంటూరెళ్ళారన్నయ్యా. యివ్వాళ రావాలి బహుశః. వాళ్ళేవస్తారుగాని భోజనాలకి లేవండి మీరు" అంటూ తొందరపెట్టింది అన్నపూర్ణమ్మ.

అందరూ వంటింట్లోకి దారితీశాను.

"ఆ వచ్చిన పనేదో యిప్పుడు చెప్పండి మావయ్యా" అంటూ కదిపింది మురళి.

"నువ్వు నన్ను మావయ్యా అని యాథాలాపంగా అన్నావేమోగాని, ఆ మాట నే నిజం చేసుకోవాలని వచ్చా. మా పార్వతికి కుసుమకు పెళ్ళిచెయ్యటం అంటే సుతరామూ యిష్టంలేదు. నిన్న, నిక్కచ్చిగా అడిగితే తనకి యిష్టంలేదనీ. పూర్తిగా పెళ్ళిమానేయమనేయమనీ చెప్పింది. నా కొళ్ళు మండిపోయింది. ఇక మీదట పార్వతి మాటలు వినదల్చుకోలేదు. అందుకని కుసుమకి మీ యింట్లోనే రిజిష్టర్ మారేజ్ చేసి యింటికి తీసికెడదామని వచ్చా. బావుందా నా ఐడియా?" అంటూ పరిస్థితులన్నీ తెలియజెప్పారు.

"మీ ఐడియాకేం? దివ్యంగావుంది. కానీ, కుసుమని నాకిచ్చి పెళ్ళిచేస్తారేమిటి? కొంపతీసి పెళ్ళికొడుకుని వెదికారా?"అంది కొంటెగా మురళి.

"ఓ! పెళ్ళికొడుకుల కేంలోటమ్మా? మన రవి కుమార్ లేడూ?" అన్నారు జగన్నాధంగారు అన్నపూర్ణమ్మగారిని పరీక్షిస్తూ. ఎవరు మాత్రం ఈ సంబంధానికి వప్పుకోరు? చిలకలాంటి పిల్ల. సుమారు లక్షరూపాయలు చేసే ఆస్థి.

"ఏమండీ! వదినగారూ? వింటున్నారా, సంభాషణ" అంటూ కుసుమని గిల్లింది మురళి.

కుసుమా, మురళీ భోంచేసి వెళ్ళిపోయారు. తర్వాత జగన్నాధంగారూ. అన్నపూర్ణమ్మగారూ ఏవేవో మాట్లాడుకున్నారు. ఆ సాయంత్రానికి మురళి తండ్రికీ, రవికీ, అందరికీ తెల్సిపోయింది సంగతి. అందరూ అంగీకరించారు. రెండురోజుల తర్వాత రిజిష్టర్ మారేజి వైభవంగా జరిగిపోయింది. ఆ సాయంత్రం, జగన్నాధంగారు కూతుర్నీ అల్లుణ్ణీ తీసుకొని యింటికి బయలు దేరారు.

పెళ్ళినుంచి తప్పించాలిగదా అని షారుగూరు పంపితే, పెళ్ళిచేసుకొని తయారయింది కుసుమ. రవి డాక్టర్ పరీక్ష పాసై ప్రాక్టీసు చేస్తున్నాడు.

"ఏమిటి కుసుమా నీ మెళ్లో? మంగళసూత్రం లాగుందే?" అంది పార్వతమ్మ ఆశ్చర్యంగా, అప్పుడే బండిదిగివస్తూన్న కూతురుతో.

కుసుమ మాట్లాడలేదు.

"దాన్నేమీ అనకు పార్వతీ! నేనే ఈపనంతా చేయించాను అయిపోయిందానికి విచారించి లాభంలేదు. నువ్వెట్లాగూ వప్పుకోవుగదా అని యీపని చేయవలసి వచ్చింది. నీ మూలంగా ఎంతభాగ్యమున్నా అమ్మాయికి చక్కగా పెళ్ళి చెయ్యలేకపోయాం. అయినా చక్కని అల్లుడు దొరినందుకు సంతోషించాలి" అంటూ జరిగిన సంగతి నివేదించారు జగన్నాధంగారు. పార్వతమ్మకు కళ్ళుచీకట్లు గమ్మాయి. కాళ్ళక్రిందభూమి కుంచుకుపోతున్నట్లయింది.

"నీకు తల్లికూడా జ్ఞాపకం రాలేదా కుసుమా?" అంది కళ్ళనీళ్ళెట్టుకుంటూ.

"అమ్మా! నన్ను క్షమించమ్మా" అంటూ ఏడిచింది కుసుమ.

గుండెను రాయిచేసుకొంది పార్వతమ్మ...

"అమమ్మా? చూడవే ఆ గోపీగాడు నా తొక్కా ఎలా తింపాడో" అంటూ. చిరిగిన చొక్కా పట్టుకొని రాము పార్వతమ్మ దగ్గరకొచ్చాడు.

"అయ్యయ్యో ఎందుకు చింపాడమ్మా యిట్లా సిల్కుచొక్కానీ?" అంటూ మనమణ్ణెత్తుకుంది పార్వతమ్మ.

"అదికాదే! బిసకత్తెట్టమన్నాడు పెత్తాను. అది తినేసి, మళ్లీ పెత్తమన్నాడు. లేదన్నాను. అందుకనీ తొక్కా పత్తుకొని లాగాడే. తినిగి పోయింది" అంటూ తన బుల్లిబుల్లి కబుర్లతో జరిగిందంతా చెప్పాడు రాము.

"మరి వుంచుకోనే ఎందుకు లేవన్నావూ. పెట్టకపోయావా? అబద్దాలాడొచ్చా?" అంది మందలింపుగా పార్వతమ్మ.

"అయితే, యిప్పుడెళ్లిరానా?" అంటూ పార్వతమ్మ కళ్ళల్లోకి చూశాడు రాము.

"సాయంత్రం పెడుదువుగానిలే. అమ్మదగ్గర కెళ్ళి చొక్కాయింకోటి తొడిగించుకురా బాబూ." అంటూ రామూని దింపింది పార్వతమ్మ. రామూ బుల్లిబుల్లి అడుగువేసుకొంటూ వెళ్ళిపోయాడు. పార్వతమ్మ తనలో తానే నవ్వుకుంది. అప్పటికీయిప్పటికీ తానెంతగామారిపోయింది! రాము సూర్యకిరణంలా వుంటాడు. పచ్చని శరీరచ్ఛాయ. నల్లని వంకీయితిరిగిన బుల్లిజుత్తు.

ఒకప్పుడు మచుమలు కల్గుతారని కంపించి పోయిన పార్వతమ్మకిప్పుడు ఆ మనవడే సర్వస్వం ఐపోయాడు.

# వింతవెత

శశాంక

మబ్బేసినది చందమామా
నామదికి
మసకేసినది చందమామా!
ఊరుపులె నేరుపుగ
తెరకట్టెనో ఏమొ
వలవంత యీవింత
వెతబెట్టెనో ఏమొ
మబ్బేసినది చందమామా
నామదికి
మసకేసినది చందమామా!
వెలుగు వెన్నెలరేయి
వెలసిపోవునొ ఏమొ
బ్రతుకు నలమినహాయి
మాసిపోవునొ ఏమొ
మబ్బేసినది చందమామా
నామదికి
మసకేసినది చందమామా!
కనికరపు హిమకరము
ననుసాకదో ఏమొ
తొలివలపులెద సొలపు
కలసిపోవునొ ఏమొ
మబ్బేసినది చందమామా
నామదికి
మసకేసినది చందమామా!